# వారఫలాలు

## సాయినాథ్

"ఈ వారం శని చాలా అనుకూలంగా ఉన్నాడు. మీరు నిర్వహించే వృత్తి ప్రశాంతంగా, హాయిగా ఉంటుంది. రావల్సిన డబ్బు సరిగ్గా అనుకొన్న సమయానికి వస్తుంది. యీ వారం అప్పుల బాధ ఉండదు సరికదా అప్పులోళ్ళు బాగా గౌరవిస్తారు. మీ భార్య మిమ్మల్ని ప్రేమించటమే కాదు. పూజిస్తుంది.

ఆడవారికి చీర కొనుక్కునే అదృష్టం ఉంది."

వార ఫలాలు చదువుకుంటూ యింటి కొచ్చాడు సంతోషం. ఇతగాడికి జాతకాలపిచ్చి ఎక్కువ. పేపరుగాని, పత్రికగాని కొనగానే ముందు రాశి ఫలాలు మాత్రమే బుద్ధిగా చదువుతాడు.

గుమ్మంలో చిరునవ్వుతో ఆహ్వానం పలికింది భార్య సుందరి. ఎప్పుడూ లేనంత హుషారుగా ప్రతిమాటా ఆనందంగాకల్పించి మాట్లాడతూ మొగుడు అడక్కుండానే వేడిగా టీ తీసుకొచ్చియిచ్చింది. పంచదార కాస్త ఎక్కువ వెయ్యటం వలన సంతోషం హాయిగా లొట్టలేస్తూ తాగేశాడు.

"ఏమిటో శ్రీమతిగారు ఎప్పుడూలేంది. యివాళ యింత హుషారుగా ఉన్నారు?" అంటూ బుగ్గమీద చిటికేసి "ప్రేమగాని ఎక్కువై పోయిందా" అనడిగాడు.

"ఛీ-పోండి నేనెప్పుడూ యిలాఆనందంగానే ఉంటాను. మీరే పదేపదే చిరాకుపడుతూ నన్ను చులకన చేసేస్తున్నారు" అంది గోముగా ముఖంపెట్టి.

ఎప్పుడూ చిటపటలాడుతూ దెప్పి పొడుస్తుండే సుందరి ఇవాళ యింత ఆనందంగా ఉందంటే రాశిఫలాల కారణమే. అంటే యీ వారమంతా నా భార్య ఇలాగే హాయిగా ఉంటూ నాకు ఆనందాన్ని యిస్తుందన్నమాట! ఎంతయినా జాతకరత్న సత్యసామ్రాట్ చిలకశాస్త్రిగారురాసింది అక్షరాలా జరిగి తీరుతుంది; అనుకున్నాడు సంతోషం.

టీ తాగగానే జేబులోంచి జీతం డబ్బులు తీసి భార్య చేతిలో పెట్టాడు. ఆ తర్వాత స్నానంచేసి "ఏవోయ్, ఎటు ప్రోగ్రాం సినిమాకెళదామా?" భార్యని అడిగాడు.

"మీ ఆనందమే నా ఆనందం. నేను ఎప్పుడో తయారయిపోయాను. మీదే ఆలస్యం. వచ్చేప్పుడు అలాగే హోటల్లో టిఫిన్ చేసి వచ్చేద్దామండి. మళ్ళీ వంటెందుకు" అంది సుందరం.

"అలాగే! అప్పుడప్పుడూ హోటల్లోతింటే కాస్త వెరైటీగా ఉంటుదోయ్!" అడిగాడు సంతోషం ప్రెస్ అవుతూ.

నవ్వేసి వూరుకుంది సుందరం.

ఆ తర్వాత వారికార్యక్రమాలు జాలీగా గడిచిపోయ్యాయి.

ఆ మర్నాడు సంతోషం భార్య తలంటి పోసింది. ఆఫీసుకు వెళ్ళేముందు ఇంటి గేటు వరకు వచ్చి టాటా చెప్పింది కూడా. సాయంత్రం భర్త ఆఫీసునుంచి రాగానే వెంటనే స్నానానికి వేడి నీళ్ళుపెట్టి "ఆఫీసులో అందరి కళ్ళూ మీమీదే పడుంటాయి" అంటూ దిష్టి తీసింది. భార్య సేవలకు మురిసి పోయాడు సంతోషం.

స్నానంచేసి ప్రశాంతంగా కూర్చోగానే బియ్యం అప్పిచ్చే గుర్నాధం వచ్చాడు. సంతోషాన్ని చూడగానే ఆ వికార ముఖాన్ని చేటంత ఆనందంగామార్చుకుని "నమస్కారం సార్" అన్నాడు.

"రండి. రండి కూర్చోండి. మీ గురించే అనుకుంటున్నాం. సుందరీ. గురునాధంగారి బాకీ డబ్బులు తీసుకురా" అని కేకేశాడు.

కాసేపట్లో లోపలినుంచి సుందరి యాభయి రూపాయలు తీసుకొచ్చి గుర్నాధానికి యిచ్చింది. గుర్నాధం అతి వినయంగా డబ్బు తీసుకొని జేబులో పెట్టుకుంటూ "మీలాంటి వారికి అప్పులిచ్చినా గేరంటీ ఉంటుంది. ఇదే మీ పక్కింటి వెంకట్రావ్ చూడండి ఇప్పటికి ఐదుసార్లు తిప్పి తిప్పి సగం డబ్బులిచ్చాడు. ఎంతయినా మీ అంత నిజాయితీ గలవారు ఎవరూ ఉండరంటే నమ్మండి" అని తెగ పొగిడి వెళ్ళిపోయ్యాడు.

తర్వాత కిరాణాకొట్టా, పాలవాడు వచ్చారు. వారికీ డబ్బులిచ్చి పంపేశాడు. వారుకూడా సంతోషాన్ని పొగిడి మరీ వెళ్ళిపొయ్యారు.

అప్పులోళ్ళ పొగడ్తలు విని తబ్బిబ్బై పోయాడు సంతోషం.

నిజంగా రాశిఫలాల్లో మాదిరిగా అప్పులోళ్ళుకూడా ఎంత మెచ్చుకుంటున్నారు అనుకున్నాడు.

ఇంతలో భార్యామణి టీ తీసుకొచ్చి "ఏమండీ! శ్రావణ మాసం చీర కొనిపెడతానన్నారుగా" అంది ముద్దుగా.

"ఔనవును శ్రావణమాసం కదా! పద, నీకునచ్చిన చీర కొనుక్కుందువుగాని" అంటు టాయిలెట్ అయ్యాడు సంతోషం.

భార్యా సమేతంగా బట్టల షాపులు పదారు తిరిగి ఆఖరికి సుందరికి నచ్చిన చీర ఒకటి తీసుకున్నాడు.

"ఎలా ఉందండి చీర!" అనడిగింది సుందరి.

"చీర చాలా బావుంది. నువ్వు కట్టుకుంటే ఇంకా అందంగా ఉంటుంది" అన్నాడు సంతోషం.

ఆ మాటలకు మురిసిపోయిన సతీమణి ఏమండీ! ఇప్పటికే చాలా టైమ్ ఐపోయింది హోటల్లో టిఫిన్‌చేసి వెళదామా" అంది.

"ఆ....కానీ" అంటూ భార్యను హోటల్‌కి తీసుకెళ్ళాడు.

ఆ రోజు ఆనందంగా గడిచిపోయింది.

ఇలా ఆ వారం మొత్తం చాలా ప్రశాంతంగా, హాయిగా గడిచిపోయింది.

రెండవ వారం మొదలయింది.

అలవాటు ప్రకారం రాశిఫలాలు చదువుతూ ఇంటికొచ్చాడు సంతోషం.

"యీ వారం కుటుంబములో చిన్న చిన్న కలతలు వస్తాయి. సర్దుకుపోతే మంచిది. వృత్తి సక్రమంగాచేయలేక పై అధికారులతో మాట పడాల్సి వస్తుంది. అప్పులు చేస్తేగాని కుదరదు. యీ వారం ధనాదాయం అంతగా కనిపించడంలేదు" యీ వారం జాతకం చదువుకొని కొంచెం విచారించాడు సంతోషం. అవును మరి అన్ని రోజులూ ఆనందంగా ఎలా ఉంటుంది? జీవితమన్న తర్వాత అన్నీ ఓర్చుకోవాలి అనుకొని సర్దుకుపోయాడు.

మొదటి వారమంతా ఎంతో సంతోషంగా ఉన్న భార్య సుందరి యీ రోజు ఎదురు రాలేదు. నవ్వుతూ యింకా టీ యివ్వలేదు.

టీ యిస్తుందేమోనని చాలాసేపు చూశాడు సంతోషం. కాని అటువంటి సంఘటన జరిగేలా అనిపించలేదు. ఇక ఉండబట్టలేక

"సుందరీ....సుందరీ.... ఏదే టీ ఎక్కడ?" అనిపిలిచాడు.

"అబ్బబ్బా. ఏమిటండీ ఆ అరుపులు అంట్లు తోముతున్నా, బయటనుండే కదా వచ్చారు! ఓ అర్ధరూపాయి పడేసి తాగి రాకూడదు? ఇంట్లో కూడా టీ పొడిలేదు" చెప్పింది లోపలునుంచే సోర్సుగా.

"టీ పొడి అయిపోతుందనుకుంటే మొన్నే చెపవొచ్చుగా. కెండొండలు తగలేసి చీరకొను క్కోవటం తెలిసినప్పుడు అలిసిపోయి ఇంటి కొచ్చిన మొగుడికి టీ ఇవ్వాలనీ తెలీదు?" మరీ చిరాగ్గా అరిచాడు సంతోషం.

"అంతేలెండి మిమ్మల్ని కట్టుకున్నప్పుడే అనుకున్నాను. పెళ్ళావికి చీరకొని దాన్ని రోజుకి మూడుసార్లు చెప్పవారు. ఈ ప్రపంచంలో మీరొక్కరే. పోన్లెండి యికనుంచీ నాకేవీ కొనవద్దు. నా కర్మ యింతే" అని పెద్దగా ముక్కుచీదుకోవడం మొదలుపెట్టింది పరిస్థితి విషమించేట్టు ఉందనుకున్నాడు సంతోషం. రాశిఫలాల్లో రాసినట్టు సర్దుకుపోవడం మంచిదని. "అడకాదే అయిపోయినప్పుడు చెప్తే వెంటనే తీసుకొచ్చేవాడినిగా. టీ తాగకపోతే చూడు యెంత తల నొప్పిగా ఉందో" అన్నాడు నెమ్మదిగా.

రోజూ టీ తాగేవారు ముందు రోజు అడగొమా-రేపటికి టీ పొడి వుందా అయిపోయిందాని" డొంక తిరుగుడుగా మొగుడిమీద తప్పు పడేసింది సుందరి.

"ఛ....ఛ....యీ ఆడవాళ్ళందరూ యింతే" అంటూ విసుక్కున్నాడు.

ఐనా ఆ మాటలుకూడా భార్య చెవిలో పడ్డాయి. "నేనుకాక యింకెంత మందితో కాపురం వెలగపెడుతున్నారేంటి. ఆడవాళ్ళందరూ యింతే అంటున్నారు." అంది దెబ్బలాటకు సిద్ధమైపోయినట్టు.

"అయ్యో రామా. ఇదేంటే శ్రీరామా అంటే బూతుమాట అన్నట్టుంది నీతో. నీతో మాట్లాడటం నావల్లకాదు. కానీ కాస్త నోరు మూసుకు తగలడు" అన్నాడు నిస్సహాయంగా.

ఈ విధంగా యింట్లో పరిస్థితులు బాగోక పోయేసరికి సంతోషం మనసు బాగో లేక పరధ్యానంగా పనులు చేస్తూ మేనేజర్‌తో తిట్లు తినసాగాడు.

ఆ వారమంతా ఆ విధంగా గడిచిపోయింది

అటు యిటుగా- అప్పులతో మిగతా రెండు వారాలు ఈ విధంగానే సాగిపోయాయ్.

మళ్ళీ కొత్త నెల వచ్చేసింది.

"మీ కృషికి ప్రతిఫలం అందుతుంది. దాంతో కొన్ని కష్టాలు గట్టెక్కుతాయి. దాంపత్య జీవితం సాఫీగా ఉంటుంది. అనుకూలవతి అయిన భార్యవలన మీకు దేనికి లోటుండదు. సమాజంలో ఓడ్డంత గౌరవం లభిస్తుంది. యీ వారం హాయిగా ఆనందకరంగా సాగిపోతుంది" అని ఆ వారం రాశిఫలం చదువుకొంటూ యింటికొచ్చాడు.

మళ్ళీ భార్య గుమ్మంలో చిరు మందహాసంతో ఆహ్వానించింది. ఈసారి సంతోషానికి ఆనందం కలగలేదు. సరికదా అసలు కిటుకు అర్థమయింది.

మొదటి వారం సాధారణంగా నాలాంటి వారికి జీతాలు వస్తాయి కాబట్టి ఆనందంగానే ఉంటుంది. భార్యామణులు వారి కోరికలు తీర్చుకొంటారు. రెండో వారంనుంచీ మామూలే అనుకున్నాడు.

అసలు సామాన్యుల పరిస్థితుల్నిబట్టి రాశిఫలాలు వ్రాస్తారా! లేక నిజంగా గ్రహ ప్రభావాల ప్రకారం వ్రాస్తారా అనే ఆలోచనలో పడిపోయాడు

అప్పటినుంచి పేపర్లు ప్రతికలు కొన్నా. వారఫలాలు మాత్రం చదవటం మానేశాడు సంతోషం.

